ప్రజాశక్తి

శనివారం 8 ఏప్రిల్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు


రాజధానిలో పేదలకు ఇళ్లు

- వేగంగా అధికారుల చర్యలు
- 20 లేఅవుట్ల నిర్మాణానికి కసరత్తు
- మౌలిక సదుపాయాలకు టెండర్లు

రాజధాని గ్రామాల్లో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అధికారులు వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ అంశంపై గతనెల 21న గెజిట్‌పై రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ కేసును ఈనెల19కి వాయిదా వేసింది. దీంతోపాటు స్టే ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం ఈ అంశంలో వేగంగా ముందుకెళ్తోంది.రాజధానిలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేయడాన్ని వారు తప్పుపడుతున్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పటి వరకు నాలుగు నివాస జోన్లు ఉన్నాయి. ఇంత వరకు ఆర్-1 (ప్రస్తుత గ్రామాల్లోని నివాసాలు), ఆర్-2 (తక్కువ సాంద్రత కలిగిన గృహాలు), ఆర్-3 తక్కువ నుంచి మధ్యస్థాయి సాంద్రత కలిగిన గృహాలు), ఆర్-4 (హైడెన్సిటీ జోన్) పేర్లతో నాలుగు రకాల నివాస జోన్లు గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజధానిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలోని గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 48,218 మందికి ఉచితంగా ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అధికారులు ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించారు. ఈనెలాఖరులోగా వీరికి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



సిఆర్‌డిఎ పరిధిలో మొత్తం 1134.58 ఎకరాల భూమి పేదల ఇళ్లకోసం కేటాయించారు. మొత్తం 20 లే అవుట్లలో స్థలాలను ఇవ్వాలని నిర్ణయించారు. లే అవుట్‌ల ఏర్పాటుకు టెండర్లు కూడా పిలిచారు. రాజధాని గ్రామంతో పాటు పెండింగ్‌లో ఉన్న నిడమర్రు ప్రాంతంలో కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రు ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. సిఆర్‌డిఎ చట్టంలో సెక్షన్41(3), (4)ల ప్రకారం ఆర్-5 జోన్‌ను ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబరులో అభ్యంతరాలు, సలహాలు స్వీకరించిన ప్రభుత్వం

▶ 2లో



సమావేశం అనంతరం ఐక్యతా అభివాదం చేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

వరికపూడిసెలను సత్వరమే నిర్మించాలి

- ఎన్నికలప్పుడు మినహా చిత్తశుద్ధి చూపని పాలక పార్టీలు
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు 11న రౌండ్‌టేబుల్
- అఖిల పక్షం సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు, 150 గ్రామాలకు తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం సత్వరమే చేపట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శుక్రవారం అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 45 ఏళ్లగా వరికపూడిసెల ప్రాజెక్టు సాధన కోసం పోరాడుతుంటే వాటిని పాలక పార్టీలు ఎన్నికల్లో తమ స్వార్థానికే ఉపయోగించుకుంటున్నాయే గాని ప్రాజెక్టు పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇద్దరు ముఖ్యమంత్రులు శిలాఫలకాలు వేసి శంకుస్థాపన చేశారని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించామని, అటవీశాఖ అనుమతి లేదనే కుంటి సాకుతో నాలుగేళ్లగా మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం మండలాల్లో సాగు, తాగునీటి

▶ 2లో

వరికపూడిసెలకు ఈ నెలలోనే అనుమతి : ఎంపీ

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు ప్రాంతానికి కీలకమైన వరికపూడిసెల ప్రాజెక్టుకు ఈ నెలలో అనుమతులు వస్తాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా మాచర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పందేలకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుపై సంబంధిత మంత్రితో మాట్లాడామని, ఈ నెలలోనే అనుమతి ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వైద్యానికి 5 శాతం కేటాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజారోగ్య వేదిక నాయకులు ఎల్ఎస్ భారవి అన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటివ్స్ యూనియన్, ప్రజారోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎల్ఎస్ భారవి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు డాక్టర్ల అందుబాటు విషయంలో 18 శాతం కొరత ఉందన్నారు. దేశంలో మూడింట రెండు వంతుల జనాభా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే, కేవలం 33 శాతం హెల్త్ వర్కర్లు, 27 శాతమే డాక్టర్లు ఉండటం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుందన్నారు. వైద్యరంగంలో ప్రభుత్వాల

▶ 2లో



మాట్లాడుతున్న డాక్టర్ గోపాలం



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సాయంత్రం) : 6.27

సహరీ (ఆదివారం ఉదయం) : 4.40

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్ధనలు



గుర్రం జాషువా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తమ కుటుంబీకులు, ఆత్మీయుల సమాధులను శుభ్రం చేసి వారికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా గుంటూరు ఆనందపేటలోని నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సమాధిని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ సందర్శించి ఘన నివాళు లర్పించారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



రిగ్గింగులు చేసి గెలవాలనుకుంటే కుదరదు

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

'నేనేంటో చూపిస్తా.. ఈసారి నాపై పోటీ చేయాలంటే ప్రతిపక్షాలు భయపడే విధంగా చేస్తా' అంటూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన వ్యాఖ్యలను పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మనాయుడు అహంకారం అహంభావంతో ఉన్నారని, రౌడీయిజం తో రిగ్గింగులు చేసి గెలవాలనుకుంటే ముమ్మాటికి కుదరదని అన్నారు.ఎన్నికలకు ముందు ఎన్ని వర్గాలనైతే నమ్మించి మోసం చేశావో వారందరూ రాబోయే ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, మీసాల మురళి, దాసయ్య తదితరులు ఉన్నారు.



సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో శిలువయాత్ర

గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

గుడ్‌ఫ్రైడేను పల్నాడు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెదకూరపాడులోని ప్రార్థనల్లో ఎమ్మెల్యే నంబూరు శంకర రావు పాల్గొన్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని సాగర మాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేయగా ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు శిలువయాత్ర ప్రదర్శన నిర్వహించారు. 40 రోజుల పాటు మాలలు ధరించిన వారు వాటిని విరమించారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించారు.

పలు గ్రామాల్లో శ్రావణ్‌కుమార్ పాదయాత్ర

ప్రజాశక్తి-ఫిరంగిపురం

స్థానిక మండలంలోని బేతపూడి, గుండాలపాడు, 113 తాళ్లూరు, ఎర్రగుంట్లపాడు, పొనుగుపాడు గ్రామాల్లో టిడిపి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నారా లోకేష్ సామాజిక న్యాయ చైతన్య పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం పై తెలిపిన ఐదు గ్రామాలలో టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుండాలపాడు సర్పంచ్ కంభం పెదబాబు ఎంపీటీసీ కట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

సత్యవతి ఫౌండేషన్ అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లా వెంకట కోటయ్య సత్యవతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం శుక్రవారం ఘనముగా జరిగినది. ఈ కార్యక్రమమునకు పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ చలపతి రావు, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాసర. కోటేశ్వరరావు, (అరుంధతి సేవా సమితి) అధ్యక్షులు ఎం. చంద్రం, (ప్రముఖ న్యాయవాది) శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చలపతిరావు, మాట్లాడుతూ వీరి ఫౌండేషన్ బాగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఇంటింటికీ స్టికర్లు అంటించిన మంత్రి అంబటి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి, ప్రజా మద్దతు పుస్తకములోని ప్రశ్నలను ఇంటిలోని సభ్యులను అడిగి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. . ప్రభుత్వానికి అండగా ఉన్న, అనుకూలంగా ఉన్న కుటుంబాలలో సెల్ ఫోనుకు, గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ను మంత్రి స్వయంగా అంటిస్తున్నారు . రానున్న 14 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించే విధానాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ప్రారంభమైనది. స్థానిక శివాలయం కాలనీ, బిసి కాలనీలో ఈ కార్య క్రమం జరిగింది. గ్రామ సచివాలయం కన్వీనర్, గృహ సారథులు,గ్రామ వాలంటీర్లు గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు ప్రభుత్వము అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు.



కొమెరపూడిలో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఆశ్రమం ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ఆస్తులపై అక్రమంగా ప్రవేశించేవారిపై తగిన చర్యలు తీసుకోవాలని పట్టన సిఐ శోభన్ బాబు ను జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు .ఆశ్రమ భాద్యులు .భక్తులు శుక్రవారం అంబటిని కలసి ఆశ్రమ ఆస్తులలో కొంత భాగాన్ని పెద్దిరెడ్డి గోవిందరెడ్డి మరికొందరు ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని విజ్ఞాపన పత్రం అందించారు .దీనిపై స్పందించిన మంత్రి అంబటి స్థానికి సిఐ శోభన్ బాబు కు ఫోన్ లో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొని .ఆశ్రమ నిర్వహనకు అడ్డుపడుతూ నిరంతరం అక్రమానుకు ప్రయత్నిస్తున్న వారిపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలన్నారు .ఆశ్రమ ఆస్తులు పూర్తిగా రిజిస్టర్ కాబడినవని దాత ఆశయాలకు అనుగుణంగా గత 84సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు విద్య వైద్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కొందరు కావాలని తప్పుడు పత్రాలు సష్టించుకొని ఆశ్రమ ఆస్తులను ఆక్రమించుకోవాలనుకోవటం మంచి పద్దతి కాదని ఆశ్రమ నిర్వాహకులు చింతాడ బ్రహ్మనందరావు విలేకరులకు తెలిపారు.

ఆశ్రమం అధీనంలో ఉన్న ప్రతి ఆస్తికి తగిన పత్రాలు ఉన్నాయన్నారు .అధికారులపై ఒత్తిడి తెస్తూ చివరికి ఆశ్రమభాద్యు లు ఆక్రమించుకొంటున్నారని తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు .ఇప్పటికే సంబంధిత అక్రమ తప్పుడు రిజిస్ట్రేషన్ లపై కోర్టు లలో కేసులు నడుస్తున్నాయన్నారు .సత్తెనపల్లి కోర్టు వారు శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చియున్నారని భాద్యులు తెలిపారు . అనంతరం ఆశ్రమ గురువులు రత్నచారి ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

మంత్రిని కలిసినవారిలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్సులు నాగభూషణ చారి . విద్యాసాగర్ .యువజనసంఘం నాయకులూ పోతులూరి గోపి .వైసీపీ నాయకులూ అచ్యుత శివప్రసాద్ .వెలుగురి శరత్ బాబు వల్లెపు చెన్నకేశవ .మోదుగుల వెంకట్ .ఆశ్రమ భక్తులు సరితా .సింధుషా .వెంకట రెడ్డి .బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వైద్యానికి 5 శాతం కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

వైఫల్యాలను కరోనా సమయంలో కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. కేవలం బెడ్లు, ఆక్సిజన్ సదుపాయాల్లేక లక్షలాది మంది ప్రాణాలు కోల్పోవడం చూశామన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో ప్రజలందరికీ వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావన్న విషయం అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ పథకాలు కార్పొరేట్ సంస్థలు ఆసుపత్రులు ఆర్థికంగా బలపడటానికి ఉపయోగపడతాయి తప్ప ప్రజలకు ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. డాక్టర్ గోపాలం మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యం హక్కుగా ఉండాలన్నా, వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలన్నా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో కనీసం 5 శాతం ఆరోగ్య రంగానికి నిధులు కేటాయించాలని, నిత్యావసర, అత్యవసర మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీనీ పూర్తిగా ఎత్తివేయాలని అన్నారు. ప్రభుత్వ రంగంలో ఫార్మా కంపెనీలు, వ్యాక్సిన్ తయారీ కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. ప్రతి 1000 మందికి కనీసం ఒక డాక్టర్ ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తుండగా దేశంలో 1665 మందికి ఒక డాక్టరు అందుబాటులో ఉన్నారని, దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య శిబిరాల్లో 26 శాతం డాక్టర్లు కొరత ఉందని చెప్పారు. ఆరోగ్యాన్ని వైద్యాన్ని ప్రజలందరికీ హక్కుగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక నాయకులు పిఎస్.శేఖర్ రెడ్డి, జి.శ్రీనివాసరావు, ప్రజారోగ్య పరిరక్షణ జిల్లా కార్యదర్శి హనుమంతురావు, మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నమ్మ, ఇన్సూరెన్స్ రంగం నాయకులు వి.వి.కె.సురేష్ పాల్గొన్నారు.

రాజధానిలో పేదలకు ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ విచారణలు నిర్వహించింది. చివరిగా ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు సంబంధిత భూము లను గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయా లను కల్పించేందుకు వచ్చే నెల మొదటి వారంలోగా పనులు ప్రారంభించాలని సిఎం జగన్ ఇటీవల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సంబంధిత జిల్లాల వారికి స్థలాలు ఇస్తామని వారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేశారు. రాజధాని గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే జనాభా పొందిక సమతుల్యత దెబ్బతింటుందని టిడిపి నాయకులు కోర్టును ఆశ్రయించారని పేదలకు స్థలాలు ఇవ్వకుండా రాజధాని ఎలా అభివృద్ధి చెందుతుందని అధికార పార్టీ నాయకులు కొంత కాలంగా ప్రశ్నిస్తున్నారు.

పేదలకు స్థలాలు ఇవ్వకుండా టిడిపి అడ్డుకుంటుం దని వైసిపి నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాజధాని మాస్టర్‌ప్లాన్ ప్రకారం రాజధానిలో పేదల కాలనీలు ఉంటే మురికివాడలు ఏర్పాటు అవుతా యని, అందువల్ల పేదవాడలకు అవకాశం లేని రాజధాని నిర్మాణం చేయాలనే లక్ష్యంతో మాస్టర్ ప్లాన్ రూపొందించడం వల్ల తాము ఈ ప్రతిపాదనకు వ్యతిరేకిస్తున్నట్టు టిడిపి నాయకులు చెబుతున్నారు. పేదల ముసు గులో వైసిపి నాయకులు రాజధానిలో స్థలాలు కాజేస్తారని రాజధాని ప్రాంత నాయకులు ధనేకుల రామారావు ఇటీవల వ్యాఖ్యానిం చారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పరిసర ప్రాంతాలలో డిగ్రీ, బీటెక్ చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగులు విదేశాలలో ఎం.యస్ చేయడానికి కావలసిన పూర్తి సమాచారం, శిక్షణ, మరియు అడ్మిషన్ ప్రాసెస్ పూర్తిగా మా సంస్థలో అందుబాటులో కలదని సూర్య కంప్యూటర్స్ కొండలు తెలియజేశారు. స్థానిక లాయర్ స్ట్రీట్లో సూర్య కంప్యూటర్స్ నందు ఐ.ఈ.ఎల్.టి.ఎస్. గురు తమ నూతన శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వరుణ్ తెలిపారు.

వరికపూడిసెలను సత్వరమే నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

అవసరాలు తీర్చే, 60 చెరువుల్లో నీరు నింపడానికి అవకాశం ఉన్న ప్రాజెక్టును తక్షణమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పల్నాడు ప్రాంతంలో అనేక గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని, ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచడానికి ఈనెల 11వ తేదీన రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ భాగస్వామ్యం వుతామని ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ప్రకటించారు. సమావేశంలో నాయకులు యు.రాము, టి.ఆంజనేయులు, పివి.సురేష్ బాబు, ఎన్.శ్రీనివాసరావు, ఆర్‌కె.నాయుడు, కోటా నాయక్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ - ఆటో డ్రైవర్ మృతి



ప్రజాశక్తి-రొంపిచర్ల

రోడ్డు దాటుతున్న ఆటోను వేగంగా వెళ్తున్న లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల మండల కేంద్రమైన రొంపిచర్ల చెక్ పోస్ట్ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మందపాటి యేసోబు (23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తారు. నరసరావుపేట నుండి స్వగ్రామమైన కొనకంచివారిపాలెం గ్రామానికి ఆటోలో వెళ్ళుతున్నారు. మార్గ మధ్యలో స్థానిక చెక్ పోస్ట్ వద్ద గల హైవే రోడ్డును దాటుతుండగా హైదరాబాదు నుండి ఒంగోలు వైపుకు వేగంగా దానిమ్మకాయల లోడుతో వెళ్ళుతున్న లారీ అదుపుతప్పి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లారీ ఆటోను కొంత దూరం తీసుకెళ్ళటం వలన రోడ్డు ప్రక్కన గల లోయలో ఆటో పడిపోయింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ యేసోబు (23) కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డుపై దానిమ్మ కాయలు చెల్లాచెదురుగా పడిపోవడంతో గ్రామస్థులు అక్కడికి వచ్చి దానిమ్మ కాయలను ఇళ్ళకు తీసుకెళ్ళారు.

సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్ సురేష్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. రోడ్డు పై తిరగబడిన లారీని, లోయలో పడిన ఆటోను క్రేన్ సహాయంతో పైకి తీశారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు.





సంఘటనా స్థలంలో తిరగబడిన లారీ, లోయలో పడిపోయిన ఆటో

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సిహెచ్ సురేష్ తెలిపారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన డిఎస్‌పి

ప్రమాదము జరిగిన సంఘటన స్థలమును శుక్రవారం నరసరావుపేట డిఎస్పీ కె.విజయభాస్కరరావు సందర్శిం చారు. ప్రమాదము జరిగిన తీరును అక్కడ ఉన్నవారిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండలంలో హైవే రోడ్డు పరిధిలో గల సంతగుడిపాడు, మర్రిచెట్టు పాలెం, విప్పర్ల, సుబ్బయ్య పాలెం జంక్షన్, అన్నవరప్పాడు గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సందర్శించి తగు సూచనలు ఇచ్చారు. ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. వాటిని ప్రతిరోజూ పోలీసులు పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సిఐ వై.భక్తవత్సల రెడ్డి, ఎస్ ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ జిఎంసి క్యాష్ కౌంటర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఆస్తి పన్ను చెల్లింపునకు వీలుగా సెలవు రోజుల్లోనూ గుంటూరు నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ ఈ కౌంటర్లు ఉంటాయన్నారు. ఒకేసారి ఆస్తి, ఖాళీ స్థలం పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్‌మెంట్ నంబర్‌తో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి, పన్ను చెల్లించి రాయితీ పొందవచ్చన్నారు.



బాబురావును పరామర్శిస్తున్నా ఎంఎల్‌ఎ సుచరిత

మాజీ సర్పంచ్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే సుచరిత

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వైసిపి పత్తిపాడు మండల పరిధి గొట్టిపాడు గ్రామ మాజీ సర్పంచ్, వైసిపి నాయకులు, గుంటుపల్లి బాబురావు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ 2 రోజులుగా గుంటూరు పట్టణంలోని శ్రీకృష్ణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసుకొని ఎంఎల్‌ఎ సూచరిత హాస్పిటల్‌లో ఉన్న బాబురావును పరామర్శించారు. కృష్ణ హాస్పిటల్ వైద్యులతో బాబురావు ఆరోగ్యం గురించి మాట్లాడారు. పరామర్శించిన వారిలో వైసీపీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ గట్టు విజయ్, జడ్పిటీసి కృష్ణారెడ్డి, పాటిబండ్ల కవిత, మన్నవ మహేంద్ర మాట్లాడారు.

ఇద్దరు మందుబాబులు అరెస్టు

అర్ధరాత్రి రోడ్డుపైన మద్యం తాగుతున్న వారిపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

అర్ధరాత్రి వేళ రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టి మద్యం సేవిస్తున్న ఇరువురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కఠెవరంలో ఈనెల ఐదున అర్ధరాత్రి ఇరువురు వ్యక్తులు రెండు ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెట్టి, ప్రజలను అసౌకర్యానికి గురిచేసిన ఇరువురిపై పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వటంతో వారిని అదుపులోకి తీసుకున్నామని, రెండు ఆటోలను సీజ్ చేసిన కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

8 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని విశదల గ్రామంలో పేకాట స్థావరంపై మేడికొండూరు పోలీసులు శుక్రవారం మెరుపు దాడి చేశారు. సిఐ వాసుకి వచ్చిన సమాచారం మేరకు ఈ దాడి జరిగింది. విశదల గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం పై మేడికొండూరు సి.ఐ వాసు, ఎస్సై మధు పవన్, పలువురు సిబ్బంది పేకాట శిబిరం పై రైడ్ చేయగా మొత్తం ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 26,790 సీజ్ చేసి, సదరు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



135 సీసాల తెలంగాణ మద్యం స్వాధీనం

ముగ్గురు అరెస్టు : ఎస్ఐ మురళికృష్ణ

ప్రజాశక్తి - మాచర్ల

తెలంగాణ ప్రాంతం నుండి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్ఇబి పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. 135 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను ఆదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్.ఐ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఇబి పోలీసుస్టేషన్ వద్ద విలేఖరుల సమావేశంలో ఎస్.ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ మాచర్ల మండలం, పశువేముల గ్రామానికి చెందిన ఎం చెన్నకేశవులు, మట్టపల్లి పుల్లారావు, పోచమళ్ళ శ్రీనివాస్‌లు గత కొంత కాలంగా తెలంగాణ ప్రాంతం నుండి మద్యం తెచ్చి ఇక్కడ అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారు విక్రయించటమే కాకుండా తాళ్ళపల్లి గ్రామానికి చెందిన దేరంగుల లక్ష్మీ, పట్టణానికి షేక్ జాకీర్ ఉస్సేన్‌ల ద్వారా కూడ మద్యం విక్రయాలు చేయిస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఎం చెన్నకేశవులు, దేరంగుల లక్ష్మీ పరారిలో ఉన్నట్లు తెలిపారు. దొరికిన వారిని కోర్టులో హజరుపర్చనున్నట్లు తెలిపారు.



స్థల వివాదం పరిష్కారం కోసం ధర్నా

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఆవరణలో ఉన్న తమ మసీద్ స్థలంలో మసీద్ నిర్మాణం చేసుకోకుండా అడుకోవటం ఆన్యాయమంటూ శుక్రవారం సాయంత్రం మైనారీటలు బస్టాండ్ సెంటర్‌లో గంటసేపు ధర్నా చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న స్థలంలో తమ మసీద్‌కు చెందిన స్థలం ఉందని, తాము మసీద్ నిర్మాణం చేయబోగ కళాశాల ప్రిన్సిపాల్ పట్టణ పోలీసుస్టేషన్‌లో కళాశాలకు చెందిన స్థలం ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంలో పోలీసులు మైనారీటీ పెద్దలను పిలిచి స్థల వివాదం పరిష్కారం అయ్యే వరకు అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పటంతో ముస్లిములు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోని కళాశాల పత్రాలను పరిశీలన చేసి సరైన నిర్ణయం తీసుకుంటామని తెలపటంతో ఆందోళన ను మైనార్టీలు విరమించారు.

సంక్షేమాన్నిచ్చాం.. ఆశీర్వచనం అడుగుతున్నాం..

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పల్నాడు జిల్లాలోని పలుచోట్ల ఎమ్మెల్యేల ప్రచారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రజలకు సంక్షేమాన్ని అందించామని, ఇప్పుడు ఆశీర్వచనాలు అడుగుతున్నామని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైసిపి కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని, దీనిపై ప్రజల స్పందన తెలుసుకోవడానికి నేరుగా వారి వద్దకే వెళ్లాలనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిరని చెప్పారు. గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, పార్టీ నాయకులు ప్రజల ఇళ్లకు వెళ్లి వారి స్పందనను తెలుసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందించామని, ప్రజల విశ్వాసం తమకే ఉందని చెప్పారు. కులం, మతం అనే అంశాలపై ప్రజల్ని రెచ్చగొట్టకుండా అందరికీ మేలు చేశామని, ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు వెన్న హనుమారెడ్డి, యార్డు చైర్మన్ పి.బాబురావు, మండల కన్వీనర్లు నాగుల్ మీరాన్, ఏపూరి శ్రీనివాసరావు, రాయపాటి పురుషోత్తం, లింగారెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


సత్తెనపల్లిలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు


మాచర్లలో స్టిక్కర్లను అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపునకు వైసిపిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి కోరారు. స్థానిక 13వ వార్డులో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురకా కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


నరసరావుపేటలో జనం అభిప్రాయాలను నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజలకు రాజకీయ పార్టీలు జవాబుదారీగా ఉండాలన్నదే వైసిపి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని 5వ వార్డు సచివాలయ పరిధిలోని క్రిస్టియన్‌పాలెంలో వైసిపి నాయకులు, గృహ సారథులు, వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీడిస్తే వైసిపి ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా పథకాలను ఇంటికే చేరుస్తోందన్నారు. జగన్ ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేశారని చెప్పారు. స్థానిక సమస్యలు తెలుసుకొని త్వరగతిన పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు హాజరయ్యారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేసిన వారి ఇళ్లకు పోస్టర్లు అంటించారు.


అమరావతిలో కరపత్రాలను ఇస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న మంచి జరిగితే, చంద్రబాబు హయాంలో అవినీతి జరిగిందని అన్నారు. జగనన్న పాలనపై 5 ప్రశ్నలతో కూడిన పేపర్‌ను చదివి వినిపించి ప్రజల నుండి వచ్చిన స్పందనను రాసుకున్నారు. నాయకులు నిమ్మా విజయసాగర్ బాబు, ఈడుపుగంటి కరుణకుమారి, బి.హనుమంతరావు, హష్మీ, నాయుడు రాంబాబు పాల్గొన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

మూణ్ణెల్లలో అందుబాటులోకి ఆరోగ్య కేంద్రం

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో రూ.8.69 కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరావు శుక్రవారం పరిశీలించారు. మరో మూడు నెలల్లో పనులను పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి హెల్త్‌సెంటర్‌ను తెస్తామని చెప్పారు. ఇద్దరు వైద్యనిపుణులు, ఒక డెంటిస్ట్ సహా ఐదుగురు వైద్యులుంటారని, ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దామని వివరించారు.


ప్లకార్డులను చూపుతున్న నాయకులు

యూత్ కాంగ్రెస్ పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి ఆధ్వర్యంలో పెదకూరపాడులో పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఖూనీ చేస్తున్నారని, వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. దేశంలోని ఎయిర్‌పోర్టులు, షిప్‌యార్డులను అదానికి కట్టబెడుతున్నారని అన్నారు. సంపన్నుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదాని రెండో స్థానంలోకి ఎలా వచ్చారని, షెల్ కంపెనీల ద్వారా రూ.20 వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఈ అంశాలపై పలు ప్రశ్నలను స్థానికులు కార్డులపై రాసి యూత్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన పెట్టెలో వేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రహీం, అష్రాఫ్, ఉదయ్ శంకర్, పి.తిరుపతిరావు, బి.గోపి, టి.గోపి, ఎం.గోపి పాల్గొన్నారు.

10న సదరం క్యాంప్ స్లాట్ల విడుదల

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నిర్వహించే సదరం క్యాంపులకు హాజరవ్వాలనుకునే వారి కోసం స్లాట్లను రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఈ నెల 10వ తేదీన విడుదల చేస్తుందని నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సుపరింటెండెంట్ డాక్టర్ బివి రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ నుండైనా ప్రతి గ్రామ/వార్డు సచివాలయం ద్వారా లేదా మీ-సేవా ద్వారా స్లాట్‌ను బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సదరం స్లాట్స్ వెయిటింగ్ లిస్ట్ వచ్చిన వారు ఆసుపత్రి చుట్టూ తిరగనవసరం లేదని, ఆధార్‌కు అనుసంధానమైన వారి సెల్‌ఫోన్‌కు సందేశం వస్తుందని తెలిపారు. https://sadarem.ap.gov.in/SADAREM/getAcknowledgementForPWD.do లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని సదరం స్లాట్స్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానమైందో లేదో ఇకెవైసి అప్‌డేట్ చెక్ చేసుకోవాలని సూచించారు.

500 మందికి నల్లపాటి ట్రస్ట్ వైద్యసేవలు

ప్రజాశక్తి-నరసరావుపేట


మందులు పంపిణీ చేస్తున్న నల్లపాటి రాము

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లపాటి ట్రస్ట్ (నల్లపాటి ప్రమీల దేవి మెమోరియల్) ఆధ్వర్యంలో మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఉన్న కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ (రాము) ప్రారంభించారు. జొన్నలగడ్డ, పరిసర గ్రామాలకు చెందిన 500 మందికి పైగా పేదలు వైద్య సేవలు పొందారు. ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ దండమూడి వెంకటేశ్వరరావు, జనరల్ సర్జన్ చెరుకూరి హాస్పిటల్ అధినేత డాక్టర్ చెరుకూరి ఫణి కుమార్, ప్రముఖ గైనకాలజిస్ట్ ఝాన్సీ లక్ష్మీ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.రమాదేవి, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ చింతల కేధార్‌నాథ్, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ చైతన్య, గుండె వైద్యనిపుణులు డాక్టర్ నూకవరపు వాసుబాబు, ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు డాక్టర్ నూకవరపు రమామణి, దంత వైద్య నిపుణులు డాక్టర్ కొల్లూరి కృష్ణ చైతన్య పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రానున్న రోజుల్లో నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అవార్డు పొందిన ఆయుర్వేద వైద్యులు శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి - బెల్లంకొండ

వైద్యునిగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను పల్నాడు జిల్లా ప్రథమ వార్షికోత్సవంలో బెల్లంకొండ మండల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైసిపి నాయకులు, రాష్ట్ర ఆయుష్ శాఖా కమిషనరేట్ సిబ్బంది కలిసి డాక్టర్ శ్రీనివాస్‌ను శుక్రవారం సత్కరించారు. కార్యక్రమానికి వైసిపి నాయకులు జి.చిన్నబాబురావు అధ్యక్షత వహించగా కె.దరీయా, మౌలాలి, కరీముల్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం చిన్నారులకు పళ్లు పంపిణీ చేశారు.


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

పేదలకు ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలి

జీవో 45 కు వ్యతిరేకంగా రాజధాని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

పేదలకు తమ సొంతఊరులోనే 5 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణం కోసం రుణం ఇవ్వాలని రాజధాని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము పేదలకు వ్యతిరేకం కాదని మరోసారి స్పష్టం చేశారు. జీవో 45 కు వ్యతిరేకంగా శుక్రవారం మందడం దీక్షా శిబిరంలో రైతులు, మహిళలు నినాదాలు చేశారు. అనంతరం మహిళా రైతు కంభంపాటి శిరీషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రెండు ఎకరాలలో ఇంటిని నిర్మించుకొని పేదలకు మాత్రం ఒక్క సెంటు స్థలం ఇస్తాననడం సహేతుకం కాదన్నారు. ఆర్ -5 జోన్ లో కాలుష్య రహిత పరిశ్రమలు, ఎడ్యుకేషన్ జోన్, బిజినెస్ పార్క్ జోన్ లాంటివి వస్తాయని, పరిశ్రమలు వస్తే దళితులు, ఇతర పేద వర్గాలకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఆర్ - 5 పేరుతో హౌసింగ్ జోన్ ఏర్పాటు, సెంటు స్థలం పంపిణీ ప్రతిపాదన వెనుక ప్రభుత్వం కుట్ర దాగుందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయికే ఇళ్ళు నిర్మించి ఇస్తామని నమ్మబలికిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాలుగేళ్లయినా టిడ్కో గృహాలను పేదలకు ఎందుకు అప్పగించలేదని నిలదీశారు. గంగా భవాని మాట్లాడుతూ ప్రభుత్వం దురుద్దేశ పూరితంగా వివాదాలు ఉన్న చోట స్థలాల పంపిణీ ప్రతిపాదన తీసుకొచ్చిందని తాము పేదలకు స్థలాలు ఇస్తామంటే రైతులు అడ్డు కుంటున్నారని ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలన్నది ప్రభుత్వం ఎత్తుగడని విమర్శించారు. వివాదాలు లేని చోట 5 సెంట్లు స్థలం ఇవ్వాలని పేదలు డిమాండ్ చేయాలని కోరారు. ఆలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ 5 పేరుతో హౌసింగ్ జోన్ ఏర్పాటు ప్రతిపాదనపై గ్రామ సభల్లో వ్యతిరేకించినా కోర్టు పరిధిలో ఉన్న అంశమైనప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నివాసం ఉండే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేదల ఇళ్లను కూల్చి, వారిని తరిమేసి వారిపై తమకు ఎంతో ప్రేమ ఉందని చెప్పడం సిగ్గు చేటన్నారు. కాగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 1207 వ రోజుకు చేరాయి. జీవో -45కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో రైతులు, మహిళల దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.



మందడం రైతు దీక్షా శిబిరంలో జోన్ - 45 కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

న్యాయవాది ఎబ్బూరి పాండురంగ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కార్మిక నాయకుడు, న్యాయవాది ఎబ్బూరి పాండురంగ శుక్రవారం మృతి చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై బలమైన దెబ్బలతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందిన ఎబ్బూరి పాండురంగ మతదేహాన్ని వైద్య సిబ్బంది మార్చురీకి తరలించారు. తొలుత అక్కడే భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అనంతరం ఎటి అగ్రహారంలోని ఇంటికి కూడా వెళ్ళి అతనితో తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాండురంగ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండదండగా నిలుస్తానని వారిలో మనోధైర్యం నింపారు.

నల్లపాడులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుడ్‌ఫ్రైడే సందర్భంగా నల్లపాడులో సమాజ చైతన్య సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు, కూలింగ్ వాటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జి.పరిశుద్ధరావు, సభ్యులు సొంగా వెంకట రమణ,దొడ్డా సురేష్, అంకం శౌరిబాబు, గుంటూరు చైతన్య కొప్పుల శ్రీనివాసరావు, జయరావు తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో తిరుపతిలో ప్రపంచ తెలుగు సాహితీ ఉత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు :తిరుపతిలోని మహతి ఆడిటోరియ ంలో 9, 10 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్స వాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో రెండ్రోజులపాటు జరిగే తెలుగు సాహితి ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం డొక్కా మాణిక్య వరప్రసాద్, జిల్లా రచయితల సంఘం ఎస్.ఎం.సుభాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక ద్వారా విశిష్ట సాహితీ సేవ చేస్తూ కవులను, కళాకారులను ప్రోత్సాహస్తూ వారు చేస్తున్న కషిని అభినందించారు. సాహితీ వేత్తలందరు పాల్గొని ఈ సాహితీ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఎస్.ఎం. సుభాని మాట్లాడుతూ ఈ సదవకాశన్ని సాహితి మిత్రులందరు ఉపయోగించుకొని తమ కలాలతో, గళాలతో బ్రహ్మోత్స వాలలో ఉత్తెజం నింపాలని కోరారు.రెండ్రోజుల కార్యక్రమంలో వివిధ ప్రక్రియలైన సాహిత్య సదస్సులు, పుస్తకావిష్కరణలు, కళా ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు ఉంటాయన్నారు. ఇప్పటికే ఆహ్వానం అందిన కవులు, కళాకారులు తమ పేర్లను జిల్లా ఆర్గనైజర్ బుర్రి కుమార్‌రాజు వద్ద ఈనెల 8వ తేదీలోగా (7989614334) నమోదు చేసుకోవాలని సూచించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, తదితరులు

మంగళగిరిలో విచ్చలవిడిగా బిర్యానీ పాయింట్లు

ప్రజారోగ్యాన్ని హరించే రసాయనాలు, బోన్ ఆయిల్

అధికారుల తనిఖీలు నామమాత్రమేనా..

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి పట్టణంలో నాన్ వేజ్ రుచులకు ప్రజలు అలవాటు పడిపోయారు. దీంతో అడ్డగోలుగా బిర్యానీ పాయింట్లు, చికెన్ పకోడీ, హలీమ్ సెంటర్లు వెలుస్తున్నాయి. గతంలో ఒక చికెన్ బిర్యానీ రూ.250 ఉండగా నేడు రూ.60, 80,100,150 లకు కూడా దొరకుతుంది. ధరలు పెరిగిన నేపథ్యంలో రేట్లు పెరగాల్సి ఉండగా ఇక్కడ ఎందుకు రేటు తగ్గుతుందని ఎవరూ కూడా ఆలోచించడం లేదు. తక్కువకు వస్తుంది కదా అని ఎగపడి తింటున్నారు. అసలు తక్కువ ధరకు ఎలా ఇవ్వగలుగుతున్నారు. బోన్ ఆయిల్ బిర్యానీ హోటళ్లలో వినియోగించే జంతువుల కొవ్వు, యముకల ద్వారా తీసిన నూనెను వాడుతున్నారని ఎప్పటినుంచో విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు దొరికే నూనె బోన్ ఆయిల్. దీంతో చేసిన ఆహారం మనం సేవిస్తే.. వ్యాధుల భారిన పడే అవకాశాలు మొండిగా ఉన్నాయి.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

జంతువధశాలలో వధించే మాంసం ప్రజారోగ్యానికి ఎటువంటి హానీ లేదని మున్సిపల్ శాఖ లోని ప్రజారోగ్య విభాగం అధికారులు ధ్రువీకరించిన అనంతరం మాత్రమే మాంసాన్ని వధించాల్సి ఉంది. అయినప్పటికీ ఆ నిబంధనలు మంగళగిరి లో జరగడం లేదు. అసలు నగరంలో జంతువధశాల లేకపోవడం కొసమెరుపు.

ఇక నగరంలోని ఓ బిర్యానీ దుకాణంలో నిల్వఉన్న మాంసాహారాలను ప్రజలకు విక్రయిస్తున్నట్లు ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కుళ్ళిపోయిన మాంసాన్ని సైతం వేడిచేసి ప్రజలకు విక్రయిస్తున్నట్లు పలువురు మాంసాహార ప్రియులు ఆరోపిస్తున్నారు. అధికారులు వీలు కుదిరినప్పుడు మొక్కుబడిగా నామమాత్రపు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప..ప్రజారోగ్యం పై ఏమాత్రం శ్రద్ధచూపడం లేదన్నది బహిరంగ సత్యం. దీనిని ఇలానే వదిలేస్తే.. ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు లేకపోలేదు.

'ఓబీసీ ఉద్యమానికి స్టాలిన్ నేతృత్వం అభినందనీయం'

ప్రజాశక్తి-గుంటూరు

బిసిల సమస్యలపై, ముఖ్యంగా జనాభా వివరాల సేకరణలో భాగంగా ఓబిసి కులగణాంకాల సేకరణ కోరుతూ దేశవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమానికి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కీలకపాత్ర పోషించటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో బిజెపియేతర పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించిన స్టాలిన్ ఒబిసి గణాంకాలను సేకరించాల్సిందేనని, లేదంటే జనాభా గణననే బహిష్కరించాలనే తరహాలో కేంద్రానికి హెచ్చరికలు జారీచేయటం సమంజసమేనన్నారు. ఓబిసి గణాంకాలు సేకరిస్తే బిసిలకు ఆర్థిక, విద్యారంగాల్లో జరుగుతున్న అన్యాయం బహిర్గతమవుతుందనే భయంతోనే కేంద్రం బిసి గణాంకాల సేకరణకు ఆమోదం తెలపట్లేదని అన్నారు. బిసిల పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే బిసి సామాజిక తరగతుల గణాంకాల సేకరణకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. బీహార్, హర్యానా ప్రభుత్వాలు బీసీ గణాంకాల సేకరణకు ముందుకు వచ్చాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కాకుండా కేంద్రమే ఎస్సీ, ఎస్టీల తరహాలో బిసి కులగణన చేయాలని డిమాండ్ చేశారు. స్టాలిన్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం పాలుపంచుకుంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న కేసన శంకరరావు

వల్లూరు శివప్రసాద్‌కు గుంటూరు జిల్లా రచయితల సంఘం అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ నాటక, కథా రచయిత, సాహితీ వేత్త వల్లూరు శివప్రసాద్ కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులుగా నియమితులైన సందర్భంగా ఆయనకు గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్.ఎం.సుభాని ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. అలాగే సంఘ సభ్యులు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎం.లలితకుమారి, బి.ఉమామహేశ్వరరెడ్డి, కెజె.రమేష్, నానా, పి.బలరామ్, ఈవూరి వెంకటరెడ్డి, గాడేపల్లి మల్లికార్జునుడు, పి. దుర్గాదేవి, షేక్.కాసింబి, తాటికొల పద్మావతి, యెక్కంటి పద్మావతి, బి. కుమారరాజు, డి. అనిల్ కుమార్ తదితరులు శివప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.



సంక్షేమ పథకాలతో పేదలకు మేలు : ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమపథకాలతో పేదప్రజలు ఆర్థికంగా, సామాజికంగా వారి కాళ్లపై నిలదొక్కుకున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 1వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా నేతత్వంలో కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్నీ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఒకే సారి ఇన్నిపథకాలు అమలు చేయలేదన్నారు. విద్య, వైద్య, వ్యవసాయానికిప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, మైనారిటీ విభాగ సలహాదారు జియవుద్దీన్, తూర్పు నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషుబాబు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, తూర్పు వైస్సార్సీపీ నాయకురాలు నూరిఫాతిమా పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలపై వివరించేందుకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు, గీతామందిరం ఛైర్మన్ శ్రీ వెలుగూరి రత్నప్రసాద్ నేతత్వంలో బ్రాడీపేటలోని పలు అపార్ట్‌మెంట్‌లలో ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్వయంగా తలుపు తట్టి పలకరించి ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ కన్వీనర్లు డేవిడ్, పాపారావు, శ్రీనివాసరెడ్డి, రసూల్ జానీ, విజయమ్మ, శ్యాంసుందర్, గహసారధులు వలివేటి వెంకట రమణ, పార్టీ నేతలు అరవ తిమ్మరాజు, నెరుసు శ్రీనివాసరావు, మాదాసు కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు

కూలీలు సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిపి హనుమంతరావు

ప్రజాశక్తి - అమరావతి



గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద చేపడుతున్న పనుల్లో కూలీలు పెద్దఎత్తున పాల్గొని జీవనోపాధి పొందాలని ఎంపిపి ఎం.హనుమంతరావు కోరారు. అమరావతి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని అన్నారు. కచ్చితమైన కొలతలతో నిబంధనల మేరకు పనులు చేయించాలని అధికారులను కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్లో వ్యవసాయంలో పంటల సాగుకు నీరు సక్రమంగా అందించేలా కాల్వల పూడికతీత పనులు చేయించాలని సూచించారు. వేసవిలో ఉపాధి కూలీలు ఎండ నుంచి ఉపశమనం కలిగించేందుకు టెంట్లు, తాగునీరు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దాడులకు నిరసనగా 11న చలో విజయవాడ

ప్రజాశక్తి - వినుకొండ

దళితులు, మైనార్టీలపై దాడులకు నిరసనగా సిపిఐ, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 11వ తేదీన నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు కోరారు. ఈ మేరకు స్థానిక శివయ్య భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఆర్.వందనం అధ్యక్షత వహించగా సుబ్బారావు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై దాడులు తీవ్రమైన వాటిపై సిఎం నోరు మెదపడం లేదని, దళిత యువకుణ్ణి హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలేమీ తీసుకోలేదని విమర్శించారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక దాడులు తీవ్రమయ్యాయని, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ చర్యలను ప్రజలంతా నిరసించాలని కోరారు. సమావేశంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సంఘాలు, పార్టీల నాయకులు బి.శ్రీనివాసరావు, దాసయ్య, పి.సాల్మన్‌రాజు, కె.నాగేశ్వరరావు, రాము, ప్రసన్నకుమార్, పివి సురేష్, నరసింహారావు, ఎన్.శ్రీనివాస్, కోటా నాయక్, బాజీ, ఆర్కే నాయుడు, మస్తాన్‌వలి, సీతయ్య, శశి కుమార్, పి.విజయ్, మీరావాలి హుస్సేన్ పాల్గొన్నారు.

నరసింహారావు కుటుంబానికి నరేంద్ర పరామర్శ

ప్రజాశక్తి-కారెంపూడి

మండలంలోని కాకానివారిపాలేనికి చెందిన టిడిపి నేత కర్నాటి సైదారావు తండ్రి నరసింహారావు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంఘం డైయిరి చైర్మన్ దూళిపాళ్ల నరేంద్ర కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, నాయకులు పి.అంజయ్య, జి.సురేష్ యాదవ్, రాము, కె.బాలకృష్ణ ఉన్నారు.



భారీ వాహనాలతో పొంచిన ప్రమాదం

ఇసుక లారీలను ఔటర్ రింగురోడ్డుకు మళ్లించాలి : సిపిఎం



ప్రజాశక్తి - అమరావతి

ఇసుక రీచ్‌ల నుండి భారీగా వాహనాలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయని, వీటిని అమరావతి ప్రధాన రోడ్ల మీదుగా కాకుండా ఊరి వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా పంపించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు కోరారు. ఇసుక రేవులు ద్వారా భారీ వాహనాలతో గ్రామంలో నుండి గుంటూరు, సత్తెనపల్లి వివిధ ప్రాంతాలకు వెళుతున్న ఇసుక వాహనాల వల్ల స్థానికులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఆలయ సందర్శకులు, సాధారణ ప్రయాణికులు, వాహనదార్లతో ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుందని, ఇటువైపు ఇసుక లారీలు రావడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, గతంలో భారీ వాహనాల వల్ల మద్దూరు రోడ్లో, మెయిన్ రోడ్లో అనేక ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. క్రోసూరు వైపు నుండి వచ్చే వాహనాలు వైకుంఠపురం నుండి వచ్చే లారీలు ఊరు బయట నుండి రింగ్ రోడ్డు వైపుగా వివిధ ప్రాంతాలకు వెళ్తాయని, వైకుంఠపురం అమరావతి ముత్తాయిపాలెం ఇసుక రేవులు తెరవడం వలన ఈ రేవుల నుండి వచ్చే వందల టన్నులు భారీ వాహనాలు మెయిన్ రోడ్డు నుండి వచ్చిపోతున్నాని చెప్పారు. అధికారులు స్పందించి వాహనాలను మళ్లించాలని కోరారు.

ఆస్పత్రిని పరిశీలించిన బార్ అసోషియేషన్



ఆస్పత్రి సందర్శనలో బార్ అధ్యక్షులు, సభ్యులు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషీద్ హుస్సేన్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వాస్పత్రిని వినుకొండ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు చాగంటి వీరాంజనేయ చౌదరి, కొత్తకోట హనుమంతరావు శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించడంతోపాటు అక్కడున్న రోగులతో మాట్లాడి వైద్యం సరిగా అందుతోందా? అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు శ్రీనివాసరెడ్డితో మాట్లాడి సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. పరిశీలనలో బార్ అసోసియేషన్ కోశాధికారి కాకాని నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, ఎన్.శేఖర్‌బాబు, ఎలీషా, అశోక్‌బాబు, సురేష్, ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -నాదెండ్ల

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం నినాదంతో మండలంలోని గణపవరంలోని తులసి వృద్ధాశ్రమలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆరోగ్య సూత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వృద్ధులకు డాక్టర్ ప్రసాద్ నాయక్ వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతర, మానసిక ఉల్లాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అజీజ్, పద్మావతి, జానకి దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసనలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి శ్రేణులు

ఆర్ఎంపీల పొట్ట కొట్టడానికే విలేజ్ క్లినిక్‌లు

- మొక్కల పేరుతో రూ.70 లక్షలు దోచుకున్న ఎమ్మెల్యే
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆర్ఎంపిల పొట్టగొట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తెచ్చిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంతోపాటు తెలుగు యువత అధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆర్ఎంపీలకు శిక్షణిచ్చి ప్రోత్సాహకాలు అందించారని, ఇప్పుడు విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు నిర్ణయంతో 60 వేల మంది ఆర్ఎంపీలను నిరుద్యోగులుగా మారుస్తున్నారని అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, జాబ్ క్యాలెండర్ వేయకుండా యువతను, సిపిఎస్ రద్దు చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. సిఎం గతేడాది నరసరావుపేటకు వచ్చిన సందర్భంలో నరసరావుపేటకు పాలిటెక్నిక్ కాలేజ్, ఆటోనగర్, ఫ్లై ఓవర్ హామీ ఇచ్చినా వాటి ఊసే లేదని, ఇక చిలకలూరిపేట నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ అంటే నేతి బీరకాయలో నెయ్యి మాదిరే అని ఎద్దేవ చేశారు. టిడిపి హయాంలో షాదిఖాన నిర్మించగా రూ.10 లక్షలు మిగులు నిధులు ఉన్నాయని, ప్రస్తుతం షాదీఖానా శిథిలావస్థకు చేరి రూ.10 లక్షల కరెంటు బకాయిలు ఉన్నాయని విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని చెట్లను పీకివేసి వాటి స్థానంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి ఉచితంగా తెచ్చిన మొక్కలకు బిల్లులు చేసుకుని రూ.70 లక్షలను ఎమ్మెల్యే దోచుకున్నారని ఆరోపించారు. అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న రైతుల నమోదులోనూ అధికార పార్టీ నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, అర్హులకు కాకుండా వైసిపి నాయకుల బ్యాంక్ ఖాతాలకు పరిహారాన్ని మళ్లిస్తున్నారని అన్నారు. వైసిపి నాయకుల రౌడీ రాజకీయం, అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తెలుగుయువత నాయకులు కుమ్మెత కోటిరెడ్డి మాట్లాడుతూ దేశంలో పట్టుబడిన గంజాయిలో 50 శాతం ఆంధ్రప్రదేశ్ నుండే వస్తున్నట్లు నివేదికలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన లేక యువత భవిష్యత్ అంధకారమైందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్.మారుతి, కె.శివారెడ్డి, మొహ్మద్ రఫీ, నాగూర్, జి.శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.హరికృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

తెల్లబాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -నూజెండ్ల

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ మేరకు మండలంలోని తెల్లబాడులో శుక్రవారం 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' ప్రచారం నిర్వహించారు.



'ఆధారాల్లేని ఆరోపణను సహించం'

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌పై రెండ్రోజులుగా ఎంపిపి మేకల హనుమంతరావు చేస్తున్న విమర్శలు సరికాదని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నిరూపణలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, వీటిని సహించబోమని అన్నారు. సమావేశంలో నాయకులు బి.వెంకటేశ్వరరావు, జానీ, విష్ణు, హరిబాబు, కిరణ్ పాల్గొన్నారు.



అమరేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఆక్టోపస్ డిఐజి దంపతులు

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీఅమరేశ్వరాలయాన్ని ఆక్టోపస్ డిఐజి ఎస్‌వి.రాజశేఖర్‌బాబు దంపతులు శుక్రవారం సందర్శించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్, ఆలయ అర్చకులు స్వాగతం పలికి సత్కరించారు.

ఘనంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవాలయంలో స్వామి వారి బ్రహోత్సవాల సందర్భంగా కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పోషకాహారం తీసుకోవటం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కెఎల్ విశ్వవిద్యాలయం విశ్వవిద్యాలయం ఎం. హెచ్.ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు అన్నారు. శుక్రవారం కెఎల్ విశ్వవిద్యాలయం ఎంబిఎ విభాగంలో ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆర్యోగ్య దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయి ఆయన మాట్లాడుతూ నేటితరం యువత కంప్యూటర్, మొబైల్, టీవీ తెరలకు పరిమితమై పోయారని అన్నారు. దీంతో వ్యాయామం లేక కొంత మంది యువత యుక్త వయస్సులోనే ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలతో బాధపడుతున్నారని ఆంధోళన వ్యక్తం చేశారు. కెఎల్‌యు వైద్యాధికారి డాక్టర్ బి. విద్యాసాగర్ మాట్లాడుతూ జంక్ ఫుడ్ కు అలవాటుపడి అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారని, పండ్లు, కాయకూరలు, చిరుధాన్యాలు తీసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చిరు ధాన్యాలు, మొలకలను పంపిణీ చేశారు. కెఎల్ విశ్వవిద్యాలయ వైద్యాధికారి డాక్టర్ బి. విద్యాసాగర్‌ను ఎంబిఎ విభాగపు అధ్యా పకులు ఘనంగా సత్కరించారు.

కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కెవివివి.రాజు ,విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధ సారధివర్మ, ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగపు సంక్షేమ అధికారి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ కె. హేమ దివ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందు తుందని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ


మాట్లాడుతున్న కెఎల్‌యు డీన్ డాక్టర్ కిషోర్

ఎం.వంశీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్ఎల్ఎం చైతన్య హై స్కూల్ లో ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. వంశీకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్ ఇవ్వొద్దని, పోషక విలువలు ఉన్న ఆహారం, పాలు, పండ్లు, నట్స్, పీచు వంటి ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని కోరారు. పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సంద ర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక డివిజన్ కార్యదర్శి ఎ.జయరాజు, హై స్కూల్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణ ప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రజారోగ్య వేదిక సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరావు, ఎస్ చందు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అత్యవసర విద్యుత్తు లైన్లు మరమ్మత్తులు కారణంగా ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, గుండి మెడ, వడ్డేశ్వరం, కొలనుకొండ, మెల్లంపూడి గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు విద్యుత్ శాఖ కు సహకరించాలని కోరారు.

తెనాలి నుంచి అరుణాచానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పౌర్ణమి సందర్భంగా తెనాలి డిపో నుండి మే 3వ తేదీ నుండి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడప నున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ శుక్రవారం వెల్లడిం చారు. మే 5వ తేదీ పౌర్ణమి సందర్భంగా తెనాలి నుండి శ్రీకాళ హస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరు కోనుందని తెలియజేశారు. ఈ సౌకర్యాన్ని యాత్రికులు సద్వి నియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

రంజాన్ పండుగను పురస్కరించుకుని పత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా శుక్రవారం పెద నందిపాడులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ ఎస్ విశ్రాంత అధికారి మేకతోటి దయాసాగర్, జిల్లా వక్స్ బోర్డ్ చైర్మన్ జిలాని, ఏబీ పాలెం సొసైటి చైర్ పర్సన్ కూరేటి భూషయ్య, ఉప ఎంపిపిలు ఖాసింబి, సాంబశివరావు, మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ మస్తాన్ వలి ,సర్పంచ్ పద్మారావు, ఉపసర్పంచ్ దివి రాం బాబు, వైసిపి నాయకులు బొడ్డు బుల్లియ,సర్పంచులు పాల్గొన్నారు.

బిఎం యూత్ అధ్యర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్



స్థానిక రైలుపేటకు చెందిన బి యమ్ యూత్ అధ్య ర్యంలో శుక్ర వారం 30 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం సంతోషకరంగా ఉందని అన్నారు.

'ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ఇంటింటికీ వివరిస్తాం'

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, పరిశీలకులు నిమ్మ కాయల రాజనారాయణలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో అయోధ్యరామిరెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని నేటి నుండి ఇంటింటికి వివరించనున్నట్లు చెప్పారు. అనంతరం 16వ సచివాలయం పరిధిలో పావురాలు కాలనీలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని, ప్రస్తుత ప్రభుత్వంపై సుముఖంగా ఉన్నారా లేదా అని, భవిష్యత్తులో జగనన్న పాలనను కావాలనుకుంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ఇళ్ళకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటింటికి అంటించారు. 82960829 60 నెంబర్ కు లబ్ధిదారుల ఫోన్ నుండి మిస్డ్ కాల్ ఇచ్చి ప్రజల అభిప్రాయాలను సేకరిం చారు.

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని ఫణిదంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభిం చారు. నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 87 శాతం ప్రజలకు సంక్షేమం అందిందని తెలిపారు. 'జగనన్నే మా భవిష్యత్తు 'కార్య క్రమం ఈ నెల 7 నుండి 20వ తేదీ వరకు జరుగుతుందని



వివరించారు. ఒక కోటి 60 లక్షల కుటుంబాలను ఐదు కోట్ల మం ది ప్రజలను ఈ కార్యక్రమం ద్వారా కలుసు కోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమం లో జడ్పీటీసీలు గుడి మెట్ల జ్యోతి కందుల సిద్దయ్య వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శులు కొప్పుల శేషగిరిరావు, బాకీ వెంకటస్వామి, మాజీ ఎంపిపి కొమ్మినేని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆకుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2014 ఎన్నికల అనంతరం మున్సిపల్ కార్మికులను 40 మందిని తీసేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కే దక్కుతుందని విమర్శించారు. తెలుగుదేశం నాయకులు అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదం గా ఉందని అన్నారు. సమావేశంలో ఎం. అనిలాకుమారి, జి. గంగాధర్,మహమ్మద్ మాము, నయీమ్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట క్రైస్తవ సోదరులు సిలువను ఎత్తుకొని, ఈస్టర్ గొప్పతనాన్ని తెలిపే విధంగా గీతాలు ఆలాపించారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ బొక్క బాలశౌరి, ఉపదేశి సూర్యప్రకాశరావు, గుండిమెడ రమేష్ బాబు, ఆర్.సి.యం సంఘ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి , పార్కు రోడ్డు ఇమ్మానుయేలు చర్చి నందు పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే 7 మాటల శిలువ ధ్యానాలు జరిగాయి.

ప్రజాశక్తి-దుగ్గిరాల: మండలంలోనిచర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు.తుమ్మపూడిలో ఊరేగింపు నిర్వహించారు. దుగ్గిరాల ఈమని చిలువూరు, రేవేంద్రపాడు, వీర్ల పాలెం,చుక్కపల్లి వారిపాలెం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్:మండలంలోని రావిపాడు ఆర్సీఎం చర్చి గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పల్లపాటి యల్లమంద బృందం ఏసుప్రభు వేషధారణలతో శిలువ మోస్తూ రావిపాడు ఆర్సీఎం చర్చి నుండి అబ్బినేని గుంట పాలెం లోని వేళాంగిణి మాత చర్చి వరకు ప్రదర్శన నిర్వహించారు.



టిడిపి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెనాలి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కేశన కోటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసరాలు ధరలు ఆకాశాన్ని అంటాయని సామాన్యులు బ్రతుకు జీవుడా అని కాలాన్ని వెళ్లబోస్తున్నారని అన్నారు. వారికి ధైర్యం కల్పించి రానున్న చంద్రన్న రాజ్యంలో సామాన్యులు హుందాగా బతకొచ్చన్న భరోసా కల్పించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు విజయం తథ్యమని అన్నారు. పార్టీ విజయానంతరం నిత్యావసరాల ధరలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే టిడిపి ప్రభుత్వం కచ్చితంగా రావాలని సూచించారు. చంద్రబాబు నాయుడును గద్దెనెక్కించాలంటే పార్టీ శ్రేణిల ఐక్యత ముఖ్యమని కార్యకర్తలకు పిలుపిచ్చారు.కార్యక్రమంలో అన్నాబత్తుని జయలక్ష్మి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌరాణిక కళాకారుడు వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ నటించిన 'సంగీత లక్ష్మి' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుడిని సన్మానించే కార్యక్రమంలో బభాగంగా పట్టణ పౌరాణిక నాటక కళాకారుడు ఆలపాటి వెంకటేశ్వరరావు ను నాయకులు యల్లంకి రాధ, నల్లూరి శ్రీనివాస్, కొండమూది రమేష్, గురిందపల్లి బులెబ్బాయి తదితరులు సత్కరించి, జ్ఞాపిక ను అందజేశారు.

అధిక లోడుతో వెళితే చర్యలు తప్పవు: ఎస్ఐ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల ప్రాంతంలో లారీ లేదా టిప్పర్లు చిప్స్, సంబంధిత మెటీరియల్ లోడ్ ను అనుమతికి మించి అధిక లోడ్‌తో వెళితే చర్యలు తప్పవు అని ఎస్ ఐ డి. రవీంద్ర బాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యలయం వద్ద తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వాహనాలు అతివేగముగా నడపటం, అధిక లోడ్ తో వెళ్లడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రత్యేకముగా టిప్పర్లపై దృష్టి పెట్టి, మోటర్ వెహికల్ యాక్ట్ చలానాలు విధించటం జరుగుతోందని అన్నారు. టిప్పర్ల యజ మానులు ఓవర్ లోడ్ తో గాని అతివేగాంగ గాని ప్రత్తిపాడులోకి రావడానికి వీలు లేదని అన్నారు. టిప్పర్ మీదా గ్రీన్ పట్టా కట్టుకుని రావాలని సూచించారు.అలాగే ఆటోలు కూడా పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ప్రమాదాలు సంభవిస్తునట్లు చెప్పారు. ఆటోలకు కూడ చలానాలు విధించటం జరుగు తుందని, మద్యం తాగి వాహనాలను నడిపితే వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మైనర్లకు బైక్ ఇవ్వొదని వారి తల్లిదండ్రులకు ఎస్ఐ సూచించారు.

రేపు మాచర్లలో తెలుగు రాష్ట్రాల స్థాయి పాటల పోటీ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి స్వామి వారి బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి మాచర్లలోని మానుకొండ కళ్యాణమండపంలో పాడుతా తీయగా తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విడేల శ్రీనివాసరావు, షేక్ సికిందర్‌బాషా, కోశాధికారి కంభంపాటి అంకా ప్రకాష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేఖరులతో మాట్లాడుతూ పోటీదారులకు ఉదయం 9 గంటల నుండి సోలో సాంగ్, ఫాస్ట్ బీట్ పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలు రాత్రి జరిగే ఫైనల్ పోటీలకు అర్హులని తెలిపారు. పోటీదారులకు ఎంట్రీ ఫీజు లేదన్నారు. పోటీలకు ఆర్కెస్ట్రా సహకారం అందిస్తామన్నారు. ప్రతి గాయకునికి ప్రోత్సాహక బహుమతి రూ. 300 చొప్పున క్లబ్ సభ్యులు తుమ్మేపల్లి అరవింద్ అందజేస్తారని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అర్హులైన పోటీదారులు పాల్గొనవలసిందిగా కోరారు.


యోగా మహోత్సవానికి హాజరైన విద్యార్థులు, యువత

యోగా మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సమన్వయంతో మూడు రోజుల యోగా మహోత్సవాన్ని శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మహోత్సవాన్ని ప్రారంభించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సమన్వయకర్త సుంకర రామకోటేశ్వరరావు కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. బయాలజీ ప్రొఫెసర్ టి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఒత్తిడి లేని జీవన విధానం ధ్యానంతోనే సాధ్యమన్నారు. పతంజలి యోగ్‌పీఠ్ నుండి దుర్గారావు, మల్లిఖార్జున, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్స్ డాక్టర్ ఎ.ప్రభాకర్, వి.మాధవి యోగాసనాలు నేర్పించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ కోఆర్డినేటర్ ఎ.వి.రమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు.

నాగార్జున కొండను సందర్శించిన పురావస్తు శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-విజయపురిసౌత్



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ (జాతీయ సాంస్కృతికనిధి) డాక్టర్ వసంతకుమార్ స్వర్ణకార్ శుక్రవారం సందర్శించారు. ముందుగా మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. నాగార్జునకొండలో పర్యాటకులకు సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యూజియంలోని శిల్పకళాఖండాలను, బౌద్ధదాతువును, పునర్‌నిర్మిత కట్టడాల గురించి మ్యూజియం క్యూరేటర్ కమల్ హాసన్ డైరెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ,హైదరాబాద్ సూపరింటెండెంట్ స్మితాకుమార్, జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ వెంకటయ్య, మ్యూజియం సిబ్బంది రామకృష్ణ, మాన్యుమెంట్ సిబ్బంది నీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కుయుక్తులలో జగన్ దిట్ట : మాజీ మంత్రి ఆలపాటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజకీయాల్లో కుట్రలు,కుయుక్తులలో జగన్ అందెవేసిన చేయి అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట సభలో జగన్ అన్ని అబద్ధాలే చెప్పారని ఆలపాటి విమర్శించారు. జగన్‌కి తెలిసిన కుట్రలు,కుయుక్తులు దేశంలో ఎవరికి తెలియవన్నారు. తన బాబాయి వివేకానంద రెడ్డి హత్యపై జగన్ చేసిన కుయుక్తులు ఎవ్వరూ చేయలేరని అన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల అయినా ఈ కేసులో అసలు నిందితులను ఇంతకాలం ఎందుకు పట్టుకోలేదన్నారు. తన తండ్రి రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో రిలయన్స్ అధినేతపై అభియోగాలు మోపిన జగన్ ఇప్పుడు వారితోనే చెట్టాపట్టాలేసుకొని తిరగడం కుయుక్తులలో భాగం కాదా అని ప్రశ్నించారు. జగనన్న మా భవిష్యత్ అంటూ కొత్త తరహా మోసం చేయడానికి ప్రజలవద్దకు వస్తున్న వైసిపి నేతలకి ప్రజా ఆగ్రహం తప్పదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు, పంటలకు ఇన్సూరెన్స్, విత్తనాలు, ఎరువులు ఇస్తానని చెప్పిన నువ్వు ఒక్కరికయినా న్యాయం చేసావా అంటూ ప్రశ్నించారు. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పిన మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. ప్రాథమిక వైద్యశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించలేని ఫ్యామిలీ డాక్టర్ అంటూ మోసపూరిత మాటలు చెబుతున్నారని అన్నారు. టిడిపి నాయకులు పిల్లి మాణిక్యాల రావు, శాఖమూరి నారాయణ ప్రసాద్, ఓంకార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం సౌజన్యంతో ఈనెల 9న గుంటూరు బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలోని ఉపాధ్యాయులు, చుట్టుపక్కల ఉన్న మండలాల ఉపాధ్యాయులు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆదినారాయణ, షకీలాబేగం, వెంకటేశ్వరరావు, గోవిందు, గురుబ్రహ్మం, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన సాదియాకు కెఎల్‌యు సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



హిమాచల్‌ప్రదేశ్ లోని సెంట్రల్ యూనివర్శిటీలో గత నెలలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పవర్ లిఫ్టింగ్ మహిళా ఛాంపియన్ షిప్‌లో కెఎల్ విశ్వవిద్యాలయంలో బిఎ ఐఎఎస్ చదువుతున్న సాదియా అల్మాస్ ఆలిండియా మొదటి స్థానం సాధించడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విసి చాంబర్‌లో సాదియాను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రపంచ స్థాయిలో అనేక బంగారు పతకాలు సాధించిన సాదియా దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా అత్యంత బలమైన మహిళగా బిరుదును సాధించిన సాదియా నేటి తరం బాలికలందరికీ ఆదర్శమని అన్నారు. 57 కేజీల బరువు కేటగిరిలో బెంచ్ ప్రెస్ బరువు 77 కిలోలు కాగా, డెడ్ లిఫ్ట్ 175 కేజీలు మొత్తం 452 కిలోల బరువును లేపి సాదియా భారత దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సాదియా తండ్రి స్వయంగా పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇవ్వడం సాదియా ఆ కోణంలో ముందుకు దూసుకుపోవడం ఎంతో శుభపరిణామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను కెఎల్ విశ్వవిద్యాలయంలో తాము ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు రకాల క్రీడల్లో క్రీడాకారులు అనేక పథకాలను సాధించే విధంగా కెఎల్ క్రీడా విబాగం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా క్రీడా విభాగ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్‌ను, వ్యాయామ అద్యాపకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్, వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

డాక్టర్ యర్రా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని కమ్మ బాలుర హాస్టల్ శతాబ్ది వేడుకల సందర్భంగా ఈ సంవత్సరం తలపెట్టిన ప్రజోపయోగ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం హాస్టల్ విద్యార్థులకు 'గుండెపోటుకు ప్రథమ చికిత్స' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వుప్పుటూరి అంజిత్, డాక్టర్ పి.వెంకటేష్ ఆధ్వర్యంలో హాస్టల్ ఆవరణలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. డమ్మీలను ఉపయోగించి, విద్యార్థులకు ప్రథమ చికిత్స ఎలా చేయాలనే అంశాన్ని వైద్యులు వివరించారు. పాల్గొన్న విద్యార్థులకు కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ వారు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది ప్రతిఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆకస్మికంగా ఎవరికైనా కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు ప్రక్కనే ఇటువంటి శిక్షణ పొందిన వారుంటే నిండుప్రాణాన్ని కాపాడిన వారౌతారని, విద్యార్థులంతా తాము నేర్చుకోవటమే కాకుండా తమ స్నేహితులకు కూడా ఈ మెళకువలు నేర్పించి వ్యాప్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ పాలకవర్గ సభ్యులు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, బొల్లేపల్లి శ్రీనివాసరావు, కొండబోలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- ఐఎంఎ రాష్ట్ర కార్యదర్శి ఫణీంద్ర

ప్రజాశక్తి - విజయవాడ

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఫణీంద్ర తెలిపారు. స్థానిక కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా అతిధులచేత జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని హెల్త్ ఫర్ ఆల్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిట్టినగర్‌లోని కలర్ హాస్పిటల్, కేఎల్ రావు నగర్, లంబాడి పేట తదితర ప్రాంతాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు, ఐఎంఎ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి. ఫణీంద్ర, విజయవాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎ రెహమాన్, కార్యదర్శి పి.వి. దుర్గారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మూర్తి, ఐఎంఎ ట్రెజరర్ ఆంధ్ర హాస్పిటల్ ప్రముఖ డాక్టర్ ఎం. రవీందర్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎన్.వి. రావు అధ్యక్షతన డాక్టర్లు మాట్లాడుతూ ఆరోగ్యం అంటే శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పుట్టిం దగ్గర నుంచి అనేక వ్యాక్సిన్లను బాల్యంలోనే ఇవ్వడం వల్ల చాలావరకు జబ్బుల్ని రాకుండా కాపాడుకుంటున్నామని, అందువల్లనే నేడు సగటు ఆయుషు 65 సంవత్సరాలు పైబడి ఉందని అన్నారు. అందరికి ఆరోగ్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమనందు స్మైల్ క్లబ్ చాప్టర్ సెక్రటరీ బిఎస్‌కే పట్నాయక్, క్లబ్ అధ్యక్షులు బి. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఆర్. సోమేశ్వర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.


వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అతిధులతో ఎన్‌వి రావు